BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ 04-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

# నా ఇంట్లోకి రేవంత్ రెడ్డి ఫొటో రాలే



- వైఎస్సార్ .. కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి
- అవసరమైతే జైలుకుపోతా.. నో కాంప్రమైజ్
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** ''నేను పోలీసులతో, హైడ్రా విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇండ్లను కూలుస్తాం అంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతా కానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్, కేసీఆర్ ఫోటోలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఫోటో ఇంకా రాలేదు'' అంటూ దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడిన ఆయన మరోసారి హాట్ కామెంట్స్ చేయడంపై కాంగ్రెస్ వర్గాలు భగ్గుమంటున్నాయి. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దానం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చింతల్ బస్తీ కూల్చివేతలకు సంబంధించి దానం వ్యవహారతీరును పరిశీలిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తెలిపారు. తాజాగా మరోసారి అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెడ్డి ఫోటో విషయంలో ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దలు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

- జారీచేసిన అసెంబ్లీ కార్యదర్శి
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది
- నోటీసులు అందాయన్న ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, తెల్లం వెంకట్రావు



**హైదరాబాద్, మహా:** ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు జారీచేశారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్, కడియం, యాదయ్య, బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి లకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీచేశారు. పార్టీ ఫిరాయింపుల పై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీస్ జారీచేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీం కోర్టు ను బిఆర్ఎస్ ఆశ్రయించిన నేపథ్యంలో సుప్రీం ఆదేశాలమేరకు ఈ నోటీసులు ఇచ్చారు.

**నోటీసులు అందాయి**
తమకు స్పీకర్ కార్యాలయం నుండి నోటీసులు అందాయని ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ లు మీడియాకు తెలిపారు. న్యాయనిపుణులతో చర్చించి సమాధానం ఇస్తామన్నారు.

## కేసీఆర్‌కు ప్రధాని మోదీ లేఖ

- సోదరి మృతికి సంతాపం



**మహా, హైదరాబాద్:** మాజీ మంత్రి కేసీఆర్ కు.. ప్రధానీ మోదీ లేఖ రాశారు. కొద్ది రోజుల క్రితం కేసీఆర్ సోదరి మృతిచెందడంపై ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయితే దీనిపై ప్రధాని మోదీ సంతాపాన్ని లేఖ ద్వారా తెలియజేశారు. కాగా కేసీఆర్ సోదరీ సకలమ్మ ఇటీవల అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంగతి తెలిసిందే. సోదరి మరణాన్ని చింతిస్తున్నట్లు మోదీ పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు, మీకు సానుభూతి తెలుపుతున్నానని పీఎం మోదీ కేసీఆర్‌కు లేఖలో వివరించారు. సోదరి జ్ఞాపకాలు మీ నుంచి ఎప్పటికీ దూరం కావని అన్నారు. ఆ భాధ నుంచి త్వరగా కోలుకోవాలని, ప్రజాసేవలో నిమగ్నమవ్వాలని మోదీ లేఖలో ఆకాంక్షించారు. ప్రధానీ మోదీ లేఖ రాసిన విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ తమ ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది.

## జిల్లా కోర్టులకు జడ్జిల నియామకం



**మహా, హైదరాబాద్:** తెలంగాణలో జిల్లా కోర్టులకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 30 జిల్లాలకు జిల్లా జడ్జిలను నియమిస్తూ హైకోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా పలు జిల్లాలకు జడ్జిలను హైకోర్టు నియమించింది. ఈ మేరకు వారికి కీలక ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ జిల్లా కోర్టుకు.. ఎల్ జస్టిస్ సుజోయ్ పాల్, రంగారెడ్డి జిల్లాకు జస్టిస్ పి. సామ్ కోశి, మేడ్చల్‌మల్కాజిగిరికి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి నియమితులయ్యారు. మిగతా జిల్లాలకు కూడా జడ్జిలను నియమించారు.



# కులగణన.. దేశానికే దిక్సూచి

## అసెంబ్లీ లో సీఎం రేవంత్ రెడ్డి

- దేశ చరిత్రలో నిలిచిపోతుంది
- ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదు
- సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు ప్రొసీజర్‌లో భాగమే అంటూ వెల్లడి
- సమగ్ర కులగణన నివేదికకు క్యాబినేట్ ఆమోదం

### పేదల సంక్షేమానికే..


**మహా, హైదరాబాద్:** వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసమే కులగణను చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ప్రారంభమైంది. కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చ మొదలైంది. సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలు ఉభయసభల ముందుకు తీసుకొచ్చింది ప్రభుత్వం. తెలంగాణ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులగణన రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, కులసర్వే నివేదిక సమగ్ర ఇంటింటి కులసర్వే నిర్వహించాలని 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన సర్వేలను అధ్యయనం చేశామని అన్నారు.

**మహా, హైదరాబాద్:** సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు. క్యాబినెట్ భేటీ అనంతరం సీఎం మీడియాతో చిట్ చాట్ చేశారు. "దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా, ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదు" అని వ్యాఖ్యానించారు.

### కేసిఆర్.. సమగ్ర సర్వే వివరాలు ఎక్కడా ?

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం ఎలాంటి బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. అసలు తాము బీఆర్ఎస్ పార్టీ ని పరిగణలోకి తీసుకోవడం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు నివేదికలపై చర్చకు ప్రతిపక్ష నేతల రావాలి కదా.. అని సెటైర్లు వేశారు. బీసీ రిజర్వేషన్ల పై కోర్టు ఆదేశాలతో కమిషన్ వేశామని అన్నారు. వారిచ్చిన ఆదేశాల మేరకు కమిషన్ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. ఇక ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ముందుకు వెళ్తామని అన్నారు. వర్గీకరణపై మంత్రివర్గ ఉప సంఘం, ఏక సభ్య కమిషన్ సిఫార్సుల మేరకు నడుచుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఎప్పటి వరకు అది ఎక్కడుందో తమకు తెలియదని అన్నారు. అదేవిధంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు అసెంబ్లీ కార్యదర్శి వారికి నోటీసులు ఇవ్వడం ప్రొసీజర్‌లో భాగమేనని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు.

## సప్త వాహనాలపై కోనేటిరాయుడు



- తిరుమలలో వైభవంగా రథసప్తమి వేడుకలు..అరసవల్లి సూర్యదేవాలయానికీ పోటెత్తిన భక్తులు

**మహా, తిరుపతి:** తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి సందర్భంగా మంగళవారం సప్త వాహనాలపై కోనేటిరాయుడు భక్తులకు దర్శనం ఇచ్చారు. వాహనసేవలను తిలకించేందుకు భారీగా భక్తులు తరలి రావడంతో తిరుమలలో రద్దీ నెలకొంది. భక్తులను దృష్టిలో పెట్టుకొని టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్యాలరీలలో వేచి వుండే భక్తులు ఇబ్బందులు పడకుండా తిరువీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు అన్నపానీయాల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులు.. వాహనసేవలను తిలకించేందుకు తిరుమాడ వీధులకు వెలుపల అధికారులు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అరసవల్లిలోనూ..అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలోనూ వేడుకలు వైభవంగా జరిగాయి. జనుగుతున్న వేడుకల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జడ్పీ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, మామిడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయ్ చంద్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆదిత్యుడి నిజరూప దర్శనం కోసం సోమవారం రాత్రి నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది.